ఈనాడు
హైదరాబాద్
సోమవారం మార్చి 26, 2018
■ e-mail: edc@eenadu.in


# చదువు



లక్షణమైన ఉద్యోగం. అయినా ఆ కుర్రాడికి విజయదాహం తీరలేదు. లక్షలమంది యువత పోటీ పడే గ్రూపు-I పరీక్షలకు తానూ సన్నద్ధం అయ్యాడు. ప్రణాళిక ప్రకారం చదివి గ్రూప్-I పరీక్షల్లో రెండు విజయాలు చవిచూశాడు. అప్పేచెర్ల నిషాంత్‌రెడ్డికి ఈ విజయం ఒక్క రోజులో సాధ్యం కాలేదు. పదేళ్లపాటు వివిధ పరీక్షలు రాసిన అనుభవం తోడవడంతో తొలి ప్రయత్నంలో నాలుగో ర్యాంకూ, రెండో ప్రయత్నంలో ఏకంగా రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకూ సాధించాడు. ఆ విజయగాథ అతడి మాటల్లోనే!

## మూసలో రాస్తే ఫలితం సున్నా..!



**నా** లక్ష్యం ఒక్కటే... ఎప్పటికైనా ఐఏఎస్ సాధించడం. సివిల్ సర్వీసెస్ సాధించాలని ప్రయత్నం చేసి గ్రూప్స్ వైపు అనుకోకుండా వచ్చా. వేరే రాష్ట్రాల్లో ఐఏఎస్‌గా వచ్చినా మన తెలుగు ప్రజలకు పెద్దగా ప్రయోజనం ఉండదు.. ఎక్కడో ఐఏఎస్‌గా ఉండటం కంటే మన ఊళ్ళో ఎమ్మార్వోగా ఉండటం మంచిదనే మాట నాలో బలంగా నాటుకుపోయింది. అందుకే ఆరోజు నుంచి గ్రూప్-1 ద్వారా మంచి ర్యాంకు సాధిస్తే 7, 8 ఏళ్లకు ఏపీకేడర్ ఐఏఎస్ సాధించవచ్చు అని భావించా.

గ్రూపు-1 ప్రిలిమ్స్ దశ ఉత్తీర్ణతకు ముందు ఆర్‌బీఐ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలు ఇంకా చాలా రాశా. అవన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోవే కావడంతో ప్రిలిమ్స్ సులభంగా గట్టెక్కా. అప్పటికే ఉద్యోగం చేస్తున్నా. సమయం దొరికితే వీలున్నప్పుడల్లా చదివా. ప్రిలిమ్స్ 15 రోజుల ముందు మెయిన్స్‌కు 30 రోజుల ముందు సెలవు తీసుకొని సిద్ధమయ్యా. టైంటేబుల్ తయారు చేసుకున్నాను. ఏరోజుకు ఎంతెంత చదవాలో లక్ష్యం పెట్టుకున్నా. ఒత్తిడి లేకుండా స్నేహితులను ప్రతిరోజూ కలిసేవాణ్ణి.

### కొత్తగా.. విభిన్నంగా!

మెయిన్స్‌లో అందరూ రాసే సమాధానాలు కాకుండా విభిన్నంగా, సరికొత్తగా రాయాలనుకున్నా. ఒక్కో ప్రశ్నకు కనీసం 1 మార్కు ఎక్కువ వస్తే అందరి కంటే కనీసం 30 మార్కుల తేడా వచ్చి నాకే అనుకూలిస్తుందని భావించా. చిన్నప్పుడు చేతిరాతపై మా అమ్మ బాగా అవగాహన కల్పించారు. అందువల్లే వేగంగా రాసినా చేతి రాత బాగా రాయగలిగాను.

### లోపాలు సరిదిద్దారు

ఇటీవల వచ్చిన గ్రూపు-1 పరీక్షల్లో 4వ ర్యాంకు వచ్చింది. వ్యాసరచన సక్రమంగా రాయలేక పోయినందువల్లే మొదటిసారి 4వ ర్యాంకు వచ్చింది. రెండోసారి అన్ని పేపర్లూ బాగా రాశా. కొంత విభిన్నంగా రాయడానికి ప్రయత్నించా. జాతీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు డోక్లాం, జీఎస్టీ, కరెంట్ అఫైర్స్ మీద ముందే నోట్స్ ప్రిపేర్ చేసుకొని పెట్టుకొన్నా. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఇచ్చే ప్రసంగాల్లోని ముఖ్యమైన అంశాలను వ్యాసరచన సమాధానాల్లో కొన్నిటికి జోడించా. ప్రభుత్వం చేసే ఆర్థిక సర్వే అంశాలను అవగాహన చేసుకున్నా. అందులోని అంశాలను లోతుగా చదివా. కొన్ని అంశాలు నేరుగా వచ్చాయి. గణితంలో ఎక్కువగా 131 మార్కులు వచ్చాయి.

కొడాలి భవానీశంకర్, వేదకుమారిల దగ్గర ప్రత్యేకంగా తర్ఫీదు పొందా. రెండు మూడు వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు ఇచ్చా. వారు లోపాలు సరిదిద్దారు.

### పుస్తకాలు... నోట్స్

పుస్తకాలు బాగా చదివా. ఎక్కువగా చదివిన అంశాలను నోట్స్ రూపంలో సిద్ధం చేసుకున్నా. ఈనాడు ఎడిటోరియల్స్ బాగా ఉపయోగపడ్డాయి.

ఆర్థికశాస్త్రానికి సంబంధించి పాషా నోట్స్, సైన్సుకు సంబంధించి హరికృష్ణ పుస్తకాలు చదివా. కరెంట్ అఫైర్స్‌పై పట్టు పెంచుకోవటం ముఖ్యం. తరచూ బృంద చర్చలతోపాటు నిపుణులతో మాట్లాడటం చేశా.

### కొత్తగా సన్నద్ధం కావాలి

ట్రెండ్ మారుతోంది. మూస ధోరణిలో సన్నద్ధం అయితే ఫలితం ఉండదు. సరికొత్తగా కరెంట్ అఫైర్స్‌ను చదవాలి. ఇంజినీరింగ్ చేసినా ఇతర సబ్జెక్టులను బ్యాలెన్సు చేసుకున్నా. చిన్నప్పటి నుంచి సోషల్, సైన్స్ ప్రాథమికాంశాలు బాగా వచ్చు. అందుకే నాకు గ్రూపు-1 కష్టం అన్పించలేదు. అనుకూల ఫలితం రావటానికి నాకు 8- 10 ఏళ్ళు పట్టింది. ఉద్యోగం చేస్తూ చదవడం వల్లే కొంత ఆలస్యం అయిందనుకున్నా. నాక్కూడా మొన్నటి వరకు అన్నీ అపజయాలే. అయినా ఆత్మవిశ్వాసం చెదరనీయలేదు.

పోటీపరీక్షల గురించి ఏమీ తెలియని వారికి కోచింగ్ అవసరమే. కచ్చితంగా వారికది దారి చూపుతుంది. ఎందులోనైనా కష్టపడందే విజయం రాదు. అంతిమంగా నేను చెప్పేది ఏమిటంటే తగిన కృషిచేస్తే ఆలస్యం కావొచ్చు గానీ ఫలితం రావడం మాత్రం పక్కా!

**- గొరవ గోపాల్**
న్యూస్‌టుడే, అనంతపురం విద్య

#### ఇంటర్వ్యూ ఎలా జరిగింది?

ఇన్సూరెన్సులో పని చేస్తుండటంతో చంద్రన్న బీమా, ఇన్సూరెన్సు ఎఫ్‌డీఐల అనుమతి ఇవ్వకపోవటం గురించి అడిగారు. 'రాష్ట్ర బడ్జెట్ రెండు లక్షల కోట్లు దాటుతోంది.. స్పెషల్ స్టేటస్ అవసరమా?, కేంద్ర సహాయం అవసరమా?' అనడిగారు. రాష్ట్రానికి వాగ్దానం చేశారు కాబట్టి సహాయం అవసరమే అన్నా. ఒకవేళ సహాయం చేయకున్నా రాష్ట్రం అభివృద్ధి చెందగలదని చెప్పా.

---

ఇంజినీరింగ్ పూర్తిచేసిన ఏ బ్రాంచి విద్యార్థులైనా ఐటీ రంగంలో రాణించాలనుకుంటే చేయదగ్గ పీజీ కోర్సు... మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఐటీ (ఎంఎస్ ఐటీ). పరిశ్రమ కోరుకునే నైపుణ్యాల శిక్షణను కోర్సులోనే భాగం చేయటం దీని విశిష్టత. ఆచరణాత్మక బోధనకు అగ్ర ప్రాధాన్యం ఇచ్చే ఈ ఎంఎస్ఐటీ ప్రకటన ఇటీవలే వెలువడింది. దీని ప్రాముఖ్యం, ఇతర విశేషాలూ తెలుసుకుందామా?

## నైపుణ్యాల ప్రత్యేక శిక్షణకు ఎంఎస్ఐటీ!

ఐదు విశ్వవిద్యాలయాలు స్థాపించిన కన్సార్టియం ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ (సీఐహెచ్ఎల్) ఎంఎస్ఐటీని అందిస్తోంది. మల్టీ యూనివర్సిటీ, ఇంటర్ డిసిప్లినరీ పీజీ ప్రోగ్రాం ఇది. దీనికి అమెరికాలోని కార్నెగీ మెలన్ యూనివర్సిటీతో ఎంఓయూ ఉంది. ఈ కోర్సు రెండో సంవత్సరంలో విద్యార్థులు ఒక స్పెషలైజేషన్‌ను తీసుకుంటారు. ఐటీ నైపుణ్యాలతో పాటు సాఫ్ట్‌స్కిల్స్‌నూ, కార్పొరేట్ జీవితంలో రాణించటానికి అవసరమైన లైఫ్ స్కిల్స్‌నూ నేర్పుతారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐదు చోట్ల ఈ ప్రోగ్రాం అందుబాటులో ఉంది. హైదరాబాద్‌లోని ఐఐఐటీ (110 సీట్లు), జేఎన్‌టీయూ హెచ్ (100 సీట్లు); జేఎన్‌టీయూ కాకినాడ (50 సీట్లు), జేఎన్‌టీయూ అనంతపురం (50 సీట్లు), తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (50 సీట్లు) లలో ప్రవేశాలుంటాయి.

### ప్రవేశం ఎలా?

ఈ కోర్సులో అడ్మిషన్లను ప్రవేశపరీక్ష (జీఏటీ/ జీఆర్ఈ)లో వచ్చిన ర్యాంకు ఆధారంగా నిర్ణయిస్తారు. ఎంఎస్ఐటీ కౌన్సెలింగ్ 2018లో ర్యాంకు క్రమం ప్రకారం వివిధ కేంద్రాల్లో అభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తారు.

■ జేఎన్‌టీయూకే, జేఎన్‌టీయూఏ, ఎస్‌వీయూలలో అడ్మిషన్లు పొందినవారికి 4 వారాల ప్రిపరేటరీ ప్రోగ్రాంలో శిక్షణ నిర్వహించి, విజయవంతంగా పూర్తిచేసిన తర్వాత ఎంఎస్ఐటీ మెయిన్ ప్రోగ్రాంలోకి ప్రవేశపెడతారు.

■ ఐఐఐటీ హెచ్, జేఎన్‌టీయూ హెచ్‌లలో అడ్మిషన్లు పొందినవారికి ఈ కోర్సులోకి నేరుగా ప్రవేశం ఉంటుంది.

ప్రవేశపరీక్ష అయిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీఏటీ) రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి వాక్ ఇన్స్. రెండోది ప్రవేశపరీక్ష. అభ్యర్థులు రెండిట్లో ఏదో ఒకదానికి గానీ, రెంటికీ గానీ హాజరుకావొచ్చు.

■ **వాక్ ఇన్స్:** ఆన్‌లైన్‌లో స్లాట్లు బుక్ చేసుకుని అనుకూలమైన తేదీల్లో వాక్ ఇన్స్‌కు వెళ్ళవచ్చు. హైదరాబాద్, కాకినాడల్లో వాకిన్స్ జరుగుతాయి.

■ **ప్రవేశపరీక్ష:** దీన్ని హైదరాబాద్, వరంగల్, విజయవాడ, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం, అనంతపురాల్లో నిర్వహిస్తారు. జులై 2015 తర్వాత జీఆర్ఈ రాసి 301/3.5 స్కోరు తెచ్చుకున్నవారికి ఈ జీఏటీ నుంచి మినహాయింపు ఇస్తారు.

#### 2016-18 బ్యాచ్ ప్లేస్‌మెంట్లు

ఇవి ఇంకా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకూ లభించిన వివరాలు..

| ఎక్కడ | విద్యార్థుల సంఖ్య | ఉద్యోగాలు పొందినవారు |
|---|---|---|
| ఐఐటీ హెచ్ | 85 | 75 |
| జేఎన్‌టీయూ హెచ్ | 72 | 63 |
| జేఎన్‌టీయూ కే | 22 | 22 |
| జేఎన్‌టీయూ ఏ | 1 | 1 |
| **మొత్తం** | **180** | **161** |

### ఐటీ స్కిల్స్

ఆచరణాత్మక పద్ధతిలో సాగే రెండేళ్ళ మాస్టర్ కోర్సు ఇది. కంప్యూటర్ సైన్స్, ఐటీల్లో కాన్సెప్టుల థియరీ మాత్రమే కాకుండా ప్రాక్టికల్ శిక్షణను అందివ్వడం ఈ కోర్సు ప్రత్యేకత.

◗ విద్యార్థులు కోర్ కంప్యూటర్ సైన్స్ కోర్సులను (కంప్యుటేషనల్ థింకింగ్ నుంచి కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామింగ్, ప్రిన్సిపల్స్, అల్‌గారిదమ్స్, డేటా స్ట్రక్చర్స్, కంప్యూటర్ సిస్టమ్స్, డేటా బేసెస్ వరకూ) మొదటి సెమిస్టర్లో అభ్యసిస్తారు. బీటెక్ నేపథ్యమున్న ఏ విద్యార్థి అయినా ఐటీ డొమెయిన్‌లో పటిష్ఠమైన పునాదిని మొదటి సెమిస్టర్లోనే పొందగలుగుతారు.

◗ రెండో సెమిస్టర్లో వెబ్ ప్రోగ్రామింగ్, కంప్యూటర్ నెట్ వర్క్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ లాంటి ఐటీ కోర్సులుంటాయి.

◗ సోషల్ కంప్యూటింగ్, మొబైల్ అప్లికేషన్ బిల్డింగ్, అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రోబాటిక్స్ లాంటి ఎమర్జింగ్ ఐటీ టెక్నాలజీలు రెండో సెమిస్టర్లో భాగం. సరికొత్త సాంకేతిక ధోరణులపై అవగాహనను ఇవి కలగజేస్తాయి. ఇది ఉద్యోగ సాధనలో మేలు చేస్తుంది.

◗ రెండో సంవత్సరంలో కొత్తగా ప్రవేశపెట్టిన కాంపిటీటివ్ ప్రోగ్రామింగ్ కోర్సు విద్యార్థులను మెరుగైన ప్రోగ్రామర్‌గా చేస్తుంది.

◗ ఎంతో గిరాకీ ఉన్న మెషిన్ లర్నింగ్, డేటా అనలిటిక్స్, డేటా విజువలైజేషన్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్, మొబైల్ టెక్నాలజీస్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ మొదలైన వాటి నుంచి స్పెషలైజేషన్లను ఎంచుకోవటానికి వీలు కలుగుతుంది.

◗ రెండో సంవత్సరంలో విద్యార్థులకు ఆర్నెల్ల ప్రాక్టికమ్ పీరియడ్ ఉంటుంది. ఇంటర్న్స్‌గా కంపెనీలకు వెళ్ళి నేర్చుకుని విద్యార్థి దశ నుంచి ఐటీ వృత్తినిపుణులుగా పరివర్తన చెందేలా వీరికిది సాయపడుతుంది.

#### 'నేర్పు'గా..

విద్యార్థులకు ఐటీ నైపుణ్యాలు, సాఫ్ట్‌స్కిల్స్‌ను నేర్పటం ఎంఎస్ఐటీ కరిక్యులమ్‌లో భాగం. వీటిని ప్రభావశీలంగా అభ్యసించేలా శ్రద్ధ తీసుకుంటారు.



### సాఫ్ట్ స్కిల్స్

నేటి ఐటీ పరిశ్రమకు అవసరమైనవి... నాయకత్వ సామర్థ్యాలూ, ఇంటర్ పర్సనల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలూ. విద్యార్థులు వీటికి మెరుగులు దిద్దుకునేలా ఇండస్ట్రీ ఓరియెంటెడ్ ఎంప్లాయబిలిటీ ట్రెయినింగ్ (ఐఓఈటీ) ఎంఎస్ఐటీలో లభిస్తుంది.

✦ సాఫ్ట్‌స్కిల్స్‌కు సంబంధించిన కీలక భావనల పరిజ్ఞానాన్ని ఈ-మాడ్యూల్స్ అందిస్తాయి.

✦ విద్యార్థుల్లో రాత, మౌఖిక నైపుణ్యాలను ఎల్ఎస్ఆర్‌డబ్ల్యు మాడ్యూల్స్ ద్వారా పెంచటానికి ఈ కోర్సులో కృషిచేస్తారు. దీనిలో ప్రతిరోజూ లిసనింగ్ అసైన్‌మెంట్లు, స్పీకింగ్ యాక్టివిటీస్, రీడింగ్-రైటింగ్ అసైన్‌మెంట్లు ఉంటాయి. అసైన్‌మెంట్లను మెంటర్లు మూల్యాంకనం చేసి, వాటి తీరు గురించి విద్యార్థులకు అందజేస్తారు.

✦ ఆత్మవిశ్వాసంతో సమర్థమైన ప్రెజెంటేషన్లు ఇవ్వటం కార్పొరేట్ ప్రపంచానికి అవసరం. ప్రతివారం విద్యార్థులు తరగతి విద్యార్థుల ముందు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లను మెంటర్ సమక్షంలో ఇవ్వాల్సివుంటుంది. ఇలా కోర్సు మొదటి సంవత్సరంలో ప్రతి విద్యార్థీ 48 ప్రెజెంటేషన్ల వరకూ ఇచ్చే అవకాశం ఉంటుంది. పోటీలో ఎంఎస్ఐటియన్లు ముందుండటానికి ఈ కసరత్తు పనికివస్తుంది.

✦ కార్పొరేట్ ఎటికెట్... అక్కడి మర్యాదలూ పద్ధతులపై వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు విస్తృత పరిజ్ఞానం అందించేలా ఇంటరాక్టివ్‌గా ఉండి కార్పొరేట్ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన పెంచుతాయి.

✦ ఎంప్లాయబిలిటీ నైపుణ్యాలు నేర్పటం కూడా ఎంఎస్ఐటీ కోర్సులో భాగమే. రెజ్యూమేలు తయారు చేయటం దగ్గర్నుంచి మాక్ ఇంటర్వ్యూలకు హాజరవటం వరకూ విద్యార్థులను సన్నద్ధం చేస్తారు. వీటిమూలంగా ఇంటర్వ్యూ చేసేవారు ఏం ఆశిస్తారో తెలియటం, ధైర్యంగా ముఖాముఖిలకు హాజరై విజయవంతంగా ఉద్యోగాలకు ఎంపికవటం సాధ్యమవుతాయి.

✦ నిర్దిష్టంగా శ్రద్ధగా విద్యార్థులు శిక్షణ పొందేలా మెంటర్లు సహకరిస్తారు. నలుగురి నుంచి ఏడుగురు విద్యార్థులకు ఒక మెంటర్‌ను కేటాయిస్తారు. ఈ క్లస్టర్డ్ మెంటరింగ్ సెషన్లలో మెంటర్లు విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తారు.

#### ముఖ్యమైన తేదీలు

■ **వాక్ ఇన్ ఎంట్రన్స్:** మార్చి 15 నుంచి మే 19, 2018 ■ **దరఖాస్తుల సమర్పణకు ఆఖరితేదీ:** మే 14, 2018

■ **జీఏటీ ప్రవేశపరీక్ష:** మే 27, 2018 నుంచి

■ **కౌన్సెలింగ్ మొదలు:** జూన్ 11, 2018

■ **వెబ్‌సైట్:** www.msitprogram.net

**ప్రోగ్రామ్ వివరాలకు**
సీఐహెచ్ఎల్, ఐఐఐటీ క్యాంపస్, గచ్చిబౌలి, హైదరాబాద్-500032, తెలంగాణ రాష్ట్రం
**ఫోన్:** 040-23001970, **మొబైల్:** 7799834583
**ఈ- మెయిల్:** enquiries@msitprogram.net

#### సాంకేతిక సామర్థ్యాలకు ఆస్కారం



'లర్నింగ్ బై డూయింగ్' అనే పద్ధతి ఎంఎస్ఐటీలో పదిహేడేళ్ల క్రితం ప్రవేశపెట్టినది. ఐటీ శిక్షణకు ఇది సరైన విధానమని దీనికిప్పుడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. మారుతున్న ఐటీ పరిశ్రమ ధోరణులకు అనుగుణంగా ఈ కోర్సు కరిక్యులాన్ని ఆధునికీకరిస్తూ వస్తున్నాం. కీలకమైన కంప్యూటర్ సైన్స్ కాన్సెప్టులకు అదనంగా మెషిన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రోబాటిక్స్ లాంటి సరికొత్తగా ఆవిర్భవించే సాంకేతిక సామర్థ్యాలను విద్యార్థులు నేర్చుకునేలా కోర్సు రూపకల్పన జరిగింది. దీనివల్ల గిరాకీ ఉన్న ఉద్యోగాలను పొందే వీలుంటుంది. దీంతోపాటు కంప్యుటేషనల్ థింకింగ్, అల్గారిదమ్స్, డేటా స్ట్రక్చర్స్, కాంపిటీటివ్ ప్రోగ్రామింగ్ లాంటివాటితో ప్రత్యేకంగా విద్యార్థుల కోసం రూపొందించిన కోర్సు ఇది.

***శ్రీనివాసరావు మేడా,*** *డీన్, ఎంఎస్ఐటీ*

---

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### ఎఫ్ఆర్ఐలో 98 ఖాళీలు

**సంస్థ:** ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఆర్ఐ), డెహ్రాడూన్
**పోస్టులు:** టెక్నీషియన్, ఎల్‌డీసీ, ఎంటీఎస్ తదితరాలు.
**ఖాళీలు:** 98
**అర్హత:** పదోతరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, సర్టిఫికెట్, డిప్లొమా, నిర్దేశించిన నైపుణ్యాలు.
**ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా.
**ఆన్‌లైన్ దరఖాస్తు:** 01.04.2018 నుంచి 21.04.2018 వరకు.
**వెబ్‌సైట్:** http://recruitment.fri.res.in/

#### కొంకణ్ రైల్వేలో 65 పోస్టులు

**పోస్టు:** టెక్నీషియన్
**ఖాళీలు:** 65 (ఎలక్ట్రికల్-38, సిగ్నల్ అండ్ టెలికాం-27)
**అర్హత:** పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ.
**వయసు:** 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
**ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ద్వారా.
**దరఖాస్తు:** ఆన్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.500
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 30.04.2018
**వెబ్‌సైట్:** http://www.konkanrailway.com/

#### ఎంఈసీఎల్, నాగ్‌పుర్

**సంస్థ:** మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఈసీఎల్), నాగ్‌పుర్.
**పోస్టులు:** అసిస్టెంట్ మేనేజర్ తదితరాలు **ఖాళీలు:** 16 **అర్హత, వయసు, ఎంపిక:** నిబంధనల ప్రకారం.
**ఆన్‌లైన్ దరఖాస్తు:** 09.04.2018 నుంచి 08.05.2018 వరకు
**వెబ్‌సైట్:** http://mecl.co.in/

#### ఏఈఈఎస్‌లో 50 టీచర్ పోస్టులు

**సంస్థ:** అటామిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ (ఏఈఈఎస్), ముంబయి.
**ఖాళీలు:** పీజీటీ-08, టీజీటీ-17 ప్రైమరీ టీచర్-25
**అర్హత:** ఆయా సబ్జెక్టుల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, సీటెట్.
**గరిష్ఠ వయఃపరిమితి:** పీజీటీ పోస్టులకు 40 ఏళ్లు, టీజీటీ పోస్టులకు 35 ఏళ్లు, ప్రైమరీ టీచర్ పోస్టులకు 30 ఏళ్లు.
**ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా.
**పరీక్ష కేంద్రాలు:** ముంబయి, హైదరాబాద్, ఇండోర్, జంషెడ్‌పూర్.
**చివరితేది:** 07.04.2018
**వెబ్‌సైట్:** http://www.aees.gov.in/

### ప్రవేశాలు

#### వైవీయూసెట్-2018

కడపలోని యోగి వేమన యూనివర్సిటీ వివిధ పీజీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష. **కోర్సులు:** ఎంఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంఈడీ, ఎంపీఈడీ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ, బీఎఫ్ఏ, పీజీడీటీఏ. **అర్హత:** ఇంటర్, డిగ్రీ. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ఆధారంగా.
**ప్రవేశపరీక్ష తేది:** 2018 జూన్ మొదటివారం. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500 **చివరితేది:** 15.05.2018.
**వెబ్‌సైట్:** http://www.yvudoa.net/

#### ఎన్ఐఈపీఐడీ, సికింద్రాబాద్

**సంస్థ:** భారత సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ దివ్యాంగుల సాధికారత సంస్థ (ఎన్ఐఈపీఐడీ), సికింద్రాబాద్.
**కోర్సులు:** డీఎడ్, బీఈడీ, ఎంఈడీ, డిప్లొమా, పీజీ డిప్లొమా, ఎంఫిల్
**కాలవ్యవధి:** డిప్లొమా కోర్సులకు ఏడాది, మిగిలినవాటికి రెండేళ్లు.
**విభాగాలు:** రిహాబిలిటేషన్, మెంటల్ రిటార్డేషన్, ఎర్లీ ఇంటర్‌వెన్షన్.
**అర్హత, వయసు:** నిబంధనల ప్రకారం.
**దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరితేది:** 19.05.2018
**వెబ్‌సైట్:** http://www.niepid.nic.in/

### వాక్ ఇన్ ఇంటర్వ్యూ

#### దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్

**పోస్టు:** కుక్ **ఖాళీలు:** 05 **వేతనం:** నెలకు రూ.15,000
**పని ప్రదేశం:** రైల్ నిలయం, సికింద్రాబాద్.
**అర్హత:** పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత, అనుభవం. **వయసు:** 18-33 ఏళ్ల మధ్య ఉండాలి.
**ఎంపిక:** ఇంటర్వ్యూ/ ట్రేడ్ టెస్ట్, వైద్య పరీక్షలద్వారా.
**ఇంటర్వ్యూ తేది:** 27.03.2018 **సమయం:** ఉదయం 9 గంటలకు.
**వేదిక:** ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయం, 4వ అంతస్తు, రైల్ నిలయం, సికింద్రాబాద్. **వెబ్‌సైట్:** http://www.scr.indianrailways.gov.in/

#### సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, దిల్లీ

**పోస్టులు-ఖాళీలు:** ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్-20
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ లేదా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్‌తోపాటు నెట్/ గేట్.
**వయఃపరిమితి:** ఎస్ఆర్ఎఫ్ పోస్టులకు 32 ఏళ్లు, జేఆర్ఎఫ్ పోస్టులకు 28 ఏళ్లు. **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేది:** 07.04.2018 **వేదిక:** సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, దిల్లీ.
**వెబ్‌సైట్:** http://cpcb.nic.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.